క్లుప్తంగా

పాఠశాలలకు బూట్లు, బ్యాగులు



రుద్రవరం నుంచి వివిధ పాఠశాలలకు వాహనంలో తరలిస్తున్న బ్యాగ్‌లు,షూలు

రుద్రవరం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు బ్యాగ్‌లు,బూట్లు పంపిణీకి విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల సౌకర్యార్థం ఇదివరకే బ్యాగ్‌లు, బూట్లు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకున్నాయి. ఎంఈఓ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం సీఆర్పీలు రామయ్య, శ్రీనివాసులు వాటిని వాహనంలోకి చేర్చుకొని మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలకు తరలించి హెచ్‌ఎంలకు అప్పగించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వాటిని విద్యార్థులకు అందజేయనున్నారు.

వెదుర్లు స్వాధీనం



గుర్రంపై తరలిస్తున్న వెదుర్లు

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా వెదుర్లను గుర్రంపై తరలిస్తుండగా రుద్రవరం అటవీ శాఖ అధికారులు దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. రుద్రవరం సెక్షన్ ఫారెస్టర్ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గోనంపల్లెకు చెందిన కొందరు గ్రామ సమీపాన ఉన్న అడవిలోకి వెళ్లి వెదుర్లను నరికి గుర్రాలు, సైకిళ్లపై తరలిస్తున్నారనే సమాచారంతో శుక్రవారం ఎఫ్‌బీఓ గౌడ్ నిఘా ఉంచారు. ఓ గుర్రంపై వెదుర్లను తరలిస్తుండగా.. గుర్రం, వెదుర్లను స్వాధీనం చేసుకొని రుద్రవరం అటవీ కార్యాలయానికి తరలించినట్లు చెప్పారు.

ఎంపీడీఓగా శ్రీనివాసులు



సుబ్బారెడ్డి, ఎంపీడీఓ

దొర్నిపాడు: ఈనెల 30వ తేదీన స్థానిక ఎంపీడీఓ సుబ్బారెడ్డి పదవీ విరమణ పొందనున్నారు. దీంతో ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే క్రిష్టిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పదవీ విరమణ కానున్నారు. దీంతో దొర్నిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగర్జునకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ సర్వ నరసింహస్వామి ఉపాలయ హుండీ కానుకల లెక్కింపు శుక్రవారం జరిగింది. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు జరగగా రూ.1.59 లక్షల ఆదాయం లభించింది. ఈ ఏడాది ఏప్రిల్ 4 నుంచి జూన్ 28వ తేదీ వరకు వచ్చిన కానుకలను లెక్కించామని ఈఓ నరసయ్య తెలిపారు. ఆలయ జీర్ణోదయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ఉయ్యాలవాడ : ఆరోగ్యం సురక్షితంగా ఉండేందు కు ఫిజియోథెరపీలో భాగంగా నిత్యం వ్యాయామా లు చేస్తే అనారోగ్యాలు దూరమవుతాయని హైదరాబాద్‌కు చెందిన ఫిజియోథెరపీ ట్రైనర్ రమేష్, మహేష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మోడల్‌స్కూల్‌లో మండలంలో విధులు నిర్వహిస్తున్న ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా గోపూజ



గోపూజ చేస్తున్న మహిళలు

ఆళ్లగడ్డ: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం గో పూజతో ముగిశాయి. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, సభ్యులు వీరాంజనేయరావు ఆధ్వర్యంలో బాచేపల్లె తండాలో మూడు రోజులు ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా ఉదయం గ్రామంలోని శ్రీ సేవాలాల్ మహరాజ్ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి శ్రీమద్రామాయనం, మహాభారతం, భగవద్గీత, భాగవతం తదితర గ్రంథాల గురించి వివరించారు. అనంతరం గోపూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్, శీల హరిదాస ఠాకుర్, పురోహితులు వెల్లాల రఘునాథశర్మ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు!

● మాస్టర్ ప్లాన్ వద్ద అక్రమ నిర్మాణాలను తొలగించిన మున్సిపల్ అధికారులు



మున్సిపల్ అధికారులు జారీ చేసిన నోటీసు



అక్రమ నిర్మాణాలను కూల్చి వేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణంలో ప్రతిపాదిత 60 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు అలైన్‌మెంట్ వద్ద ఉన్న నిర్మాణాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. ఈ ఎన్‌క్రోచ్‌మెంట్లకు సంబంధించి ఈ నెల 20వ తేదీన నోటీసులు జారీ చేయగా నేడు వాటిని కూల్చివేశారు. పట్టణంలోని 442 సర్వే నంబర్‌లో 18 మీటర్ల రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు ఉన్నాయి. అయితే ఇదివరకే లలితా నగర్ ప్రాంతంలో సుమారుగా 9 అనుమతులు లేని నిర్మాణాలను గుర్తించిన అధికారులు ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. ఈ ప్రాంతంలో నందరాజు అనే వ్యక్తి భవనం సుమారుగా 24 అడుగులకు పైగా ఆక్రమించి, అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టినట్లు గుర్తించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహమూర్తి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శివుడునాయక్, ఇతర వార్డు ప్లానింగ్ సెక్రటరీలతో కలిసి వాటిని సర్వే చేసి తొలగించాలని ఆదేశించారని తెలిసింది. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డిని వివరణ కోరగా.. వారు మాస్టర్ ప్లాన్‌లోని రోడ్డులో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడంతో వాటిని గుర్తించాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించానని తెలిపారు. అంతే కాకుండా అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, నిర్మాణ దశలో ఉన్న వాటిని కూడా నిలిపివేయాలని సూచించామని చెప్పారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



చిత్రేనిపల్లెలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న అధికారులు



ఉయ్యాలవాడలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ

దొర్నిపాడు: సీజనల్ వ్యాధులపట్ల గ్రామీణులు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ భార్గవి తెలిపారు. శుక్రవారం ఆమె మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామస్తులకు అవగాహన కల్పించిన అనంతరం స్థానిక సచివాలయంలో సమావేశం నిర్వహించారు. మురుగునీరు నిల్వలేకుండా చూసుకోవాలని, ఒక వేళ ఉంటే వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణకు సూచించారు. అలాగే ఇళ్ల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోడంతో పాటు పాత టైర్లు, రోళ్లు, టెంకాయ చిప్పల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. లేదంటే దోమలు వాటిని ఆవాసాలుగా చేసుకోని వ్యాధిబారిన పడేలా చేస్తాయన్నారు. రాత్రివేళల్లో తప్పని సరిగా దోమతెరలు వాడాలని చెప్పారు.

పారిశుద్ధ్యం మెరుగు పరచండి..

రుద్రవరం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో ప్రతి శుక్రవారాన్ని డ్రై డేగా పాటించాలని ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ పంచాయతీ సిబ్బందికి సూచించారు.ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని చిత్రేనిపల్లె,హరినగరం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఆదిలక్ష్మి,శివకృష్ణ, ఏఎన్‌ఎం,ఆశా వర్కర్లు చేపట్టిన డ్రైడేలో పాల్గొన్నారు.ఆయా గ్రామాల్లో కలియదిరిగి మురుగు ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్,సున్నం,వేస్టు ఆయిల్ వంటివి చల్లించారు. అలాగే ట్యాంక్‌లను శుభ్రం చేయించారు. నాగముని, గుండా వెంకటనరసింహయ్య ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ఉయ్యాలవాడ : గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓపీఆర్‌డీ మహీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని బోడెమ్మనూరు, సర్వాయిపల్లె, ఇంజేడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేశారు. ఆయన మాట్లాడుతూ డయేరియా కేసులు నమోదవవుతున్న దృష్ట్యా గ్రామాల్లో ముందస్తుగా పంచాయతీ కార్యదర్శులను సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. ప్రతి 15 రోజులకు ఒక సారి ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేయడం, పైపులైన్లు లీకులు లేకుండా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు జయరామిరెడ్డి, లక్ష్మి సువర్ణ, రాజశేఖర్‌బాబు, విజయదీప్తి, అబ్దుల్ రహీం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చాబోలులో డ్రైడే..

నంద్యాల(అర్బన్): మండలంలోని చాబోలు గ్రామంలో శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ సౌభాగ్యం, ఇన్‌చార్జ్ ఈఓఆర్‌డీ నరేంద్ర గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను సంఘం జిల్లా కార్యదర్శి ధనుంజయుడు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ జూలై 8, 9, 10 తేదీల్లో కాకినాడలో జరిగే ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులకు విద్యార్థులు తరలిరావాలని కోరారు. చదువుతో పాటు రాజకీయాలపైన ప్రశ్నించే తత్వాతన్ని విద్యార్థి దశలోనే నేర్చుకోవాలని చెప్పారు. డిగ్రీ ప్రవేశాల్లో ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి ఆఫ్‌లైన్‌లో కొనసాగించాలని డిమాండ్ చేశారు. విశ్వ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, కాస్మొటిక్ చార్జీలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. రేష్, హనుమంతు, తరుణ్, చంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో ఆయన గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో మురుగు నీరు నిల్వ ఉన్న చోట అబేట్ పిచికారీ చేయించారు. అలాగే డెంగీ నమోదైన ఇంట్లో పైరథమ్ మందు పిచికారీ చేయించారు. పంచాయతీ కార్యదర్శి దస్తగిరి ఉన్నారు.

సచివాలయ ఉద్యోగులకు పింఛన్ల మ్యాపింగ్

దొర్నిపాడు: మండలంలోని 9సచివాలయ పరిధిలోని పింఛన్‌దారులకు సచివాలయ ఉద్యోగులకు 3,743 పింఛన్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని ఎంపీడీఓ సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. అలాగే పింఛన్‌దారులకు సంబంధించిన నగదు కూడా మంజూరైందని చెప్పారు. గ్రామాల వారీగా..బుర్రారెడ్డిపల్లె 522 పింఛన్లకు రూ.34,26,500, చాకరాజువేములలో 671కి రూ.44,28,000, దొర్నిపాడు-1లో 407కు రూ.27,48,500, దొర్నిపాడు-2లో 393 మందికి రూ.26,88,000,గుండుపాపలలో 337 మందికి రూ.21,90,500 కొండాపురంలో 489 మందికి రూ.32,81,000, క్రిష్టిపాడుకు 293 పింఛన్లకు రూ.20,23,500, డబ్ల్యూ గోవిందిన్నె 342 పింఛన్లకు రూ.23,36,500, డబ్ల్యూ కొత్తపల్లెలో 289కి గాను రూ.19,87,000 పింఛన్లకు గాను నగదు విడుదలైందని, మండలంలో మొత్తం 3,743 పింఛన్లకు గాను రూ.2,51,09,500 వచ్చిందని వివరించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ నిరంజన్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కౌన్సిలర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

ఆళ్లగడ్డ: స్థానిక కోర్టు ఆవరణలో ఈ నెల 29వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఐదవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాసంఘం అధ్యక్షులు ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అదాలత్ కోసం కోర్టు ఆవరణలో రెండు బెంచ్‌లను నిర్వహిస్తామని చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీ కాదగిన క్రిమినల్ కేసులన్నిటినీ లోక్ అదాలత్ ద్వారా అప్పీలు లేని శాశ్వత పరిష్కారం పొందవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి మంగళ హారతి ఇస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో వైశాఖ శుక్రవారాన్ని పురస్కరించుకొని కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, వివిధ రకాల పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఒడిబియ్యం, పుష్పాభిషేకం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కాళీమాత సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డలో వెలసిన అయ్యప్పస్వామి 34వ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అయ్యప్ప స్వామి సేవా సమాజ్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామి వారి మూలవిరాట్‌కు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజనసేవ, క్షీరాభిషేకం, వివిధ పండ్ల రసాలతో అభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం వినాయక, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అయ్యప్పస్వామి హోమాలు జరిపించి పూర్ణా హుతిగావించారు. చివరగా స్వామి వారికి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆర్థిక సంస్కరణల ఆద్యుడు పీవీ



పీవీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నంది రైతు సమాఖ్య సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు మాజీ ప్రధాని పీవీ నరసింహరావు అని నంది రైతు సమాఖ్య గౌరవాధ్యక్షుడు, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. పీవీ నరసింహరావు 103వ జయంతిని శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ భారత రాజకీయాల్లో అపర చాణిక్యుడిగా బహుభాషా కోవిదుడుగా, రచయితగా, భారతీయ భాషల సాహిత్యాభివృద్ధికి పీవీ ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. నంద్యాలలో వ్యవసాయ కళాశాల, బ్రాడ్ గేజ్ రైల్వే, ఉపరితల వంతెనల ఏర్పాటు, అలాగే డాక్టర్ రవీంద్రనాథ్ సృష్టించిన నరసింహ అనే పత్తి వంగడాన్ని పీవీ ఆవిష్కరించారని గుర్తు చేశారు. మాధవస్వామి, రఫీ, శ్రీనివాసరెడ్డి, లక్ష్మయ్య, హుసేన్, ఓబులపతి పాల్గొన్నారు.

మినుము సాగులో మెలకువలు పాటించండి



ఎర్రగుడిదిన్నె వద్ద మినుము పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

రుద్రవరం: దెబ్బతిన్న మినుము పంటలో మెలకువలు పాటిస్తే మంచి ఎదుగుదల ఉంటుందని వ్యవసాయాధికారి శ్రీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని ఎర్రగుడిదిన్నె రైతులు ఏడాది ఖరీఫ్‌లో ముందస్తుగా దాదాపు 500 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పైరు దెబ్బతిని ఎదుగుదల నిలిచిపోయింది. ఆ పంటను ఏఓ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..వేపనూనెతో పాటు ఇతర రసాయన మందులను పిచికారీ చేయాలని, జిగురు అట్టలు ఏర్పాటు చేసుకుంటే పైరు ఏపుగా పెరుగుతుందని చెప్పారు. ఏఈఓ రాజు,ఎంపీఈఓ భవాని ఉన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



ఆర్బీకే సిబ్బందికి సూచనలిస్తున్న ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి

చాగలమర్రి: రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఆళ్లగడ్డ వ్యవసాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక 3వ ఆర్‌బీకేలో సిబ్బందితో వ్యవసాయ శాఖకు చెందిన వివిధ కార్యక్రమాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల్లో 5 శాతం వెరిఫికేషన్ ఈ నెల 29వ తేదీ లోపు పూర్తి చేయాలని, లేనిచో వారు అనర్హులవుతారనే విషయాన్ని సంబంధిత రైతులకు తెలియజేయాలని చెప్పారు. సిబ్బంది భూసార పరీక్షలకు మట్టి నమూనాలను సేకరించాలని తెలిపారు. ఏఓ రంగనేతాజీ, ఆళ్లగడ్డ టెక్నికల్ ఏఓ నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ప్రజా సంక్షేమమే లక్ష్యం

చాగలమర్రి: ప్రజా సమస్యల పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ కృషి చేస్తుందని, బాధితుల పక్షాన పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ముల్లా మహమ్మద్ షఫి కూమార్తె వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసేందుకు పదవి అక్కర్లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా కక్ష సాధింపులు, దౌర్జన్యాలకు తెర తీశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా దీవెన పథకానికి నిధులు కేటాయించినా ఎందుకు జమ చేయలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. అలాగే చేయూత పథకం నిధులను కూడా ఇప్పటికీ జమ చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తుందన్నారు. పార్టీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, చక్రం షబ్బీర్ అహ్మద్, వైస్ ఎంపీపీ ముల్లా.రఫీ, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, సర్పంచ్ గోవిందయ్య, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు గణేష్ రెడ్డి, ఎంపీటీసీ లక్ష్మీరెడ్డి, నాయకులు శేషు రమేష్, రామగుర్విరెడ్డి పాల్గొన్నారు.

అపరిశుభ్రతతోనే విషజ్వరాలు



పోలూరులో తొట్టిలో నిల్వ ఉన్న నీటిని తోడిస్తున్న డీపీఓ మంజులవాణి

నంద్యాల(అర్బన్): గ్రామాల్లో అపరిశుభ్ర పరిసరాలతోనే విషజ్వరాలు ప్రబలుతున్నాయని జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి అన్నారు. శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోలూరు గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య, పూడికతీత పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పొడి, తడి చెత్తలను వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో వస్తున్న డెంగీ, మలేరియా వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మన్న, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని కోడిగుడ్లు



ఎల్లావత్తుల పాఠశాలలో గుడ్డు లేకుండా భోజనం చేస్తున్న విద్యార్థులు

రుద్రవరం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కోడి గుడ్డు అందడం లేదు. ఇదేమని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను ప్రశ్నించగా.. ఏజెన్సీ వారు సరఫరా చేయలేదని చెబుతున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పౌష్టికాహారం కింద రోజూ ఒక కోడి గుడ్డు ఇవ్వాల్సి ఉంది. అయితే రెండు రోజుల నుంచి ఎల్లావత్తుల, ముత్తలూరు, చందలూరు తదితర గ్రామాల్లో ఏజెన్సీ నిర్వాహకులు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంగా ఆకుకూర పప్పు, అన్నం మాత్రమే వడ్డించారు. కోడి గుడ్డును ఎత్తేశారు. విద్యార్థులకు కోడి గుడ్లు వడ్డించకపోవడంపై ఎంఈఓ కోటయ్యను వివరణ కోరగా.. కొన్ని పాఠశాలల్లో కోడి గుడ్లు అందలేదన్న విషయం వాస్తవమేనన్నారు. టెండర్‌దారులు ఇదివరకు సరఫరా చేశారని, అవి ఉన్నంత వరకు విద్యార్థులకు అందించామని, ప్రస్తుతం కొన్ని పాఠశాలల్లో అయిపోయాయని మరి కొన్ని అదే బాటలో ఉన్నాయని తెలిపారు. ఇంకా సరఫరా కావాల్సి ఉందని చెప్పారు.

అధ్యాపక వృత్తి ఉన్నతమైనది



అధ్యాపకుడు హుసేన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోస్పాడు: అధ్యాపక వృత్తి ఎంతో పవిత్రమైనదని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సునీత అన్నారు. గోస్పాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న హుసేన్ పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా కళాశాలలో శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసి విద్యార్థుల ఉన్నతికి ఎంతో కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనను కళాశాల అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఖాజా హుసేన్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక రహదారి వెడల్పు చేయండి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని బైటిపేటలో నున్న హిందూ శ్మశానవాటికకు వెళ్లే రోడ్డు ఇరుకుగా ఉందని, మృతదేహాలను తీసుకెళ్లే సమయంలో ఇక్కట్లు ఎదరవుతున్నాయని, రోడ్డును వెడల్పు చేయాలని బ్రాహ్మణ సమాఖ్య సేవా గౌరవాధ్యక్షుడు, న్యాయవాది రావినూతల దుర్గాప్రసాద్, విశ్వనాథ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం న్యాయశాఖ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో రోడ్డు వెడల్పుగా ఉండేదని, కాలక్రమేణా రోడ్డుతో పాటు శ్మశానవాటిక పరిసరాలు ఆక్రమణలకు గురికావడంతో తాము మృతదేహాలను తరలించడానికి ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అంత్యక్రియలకు వెళ్లే సమయంలో ఆయా కాలనీల వాసులు అడ్డుచెబుతున్నారని ప్రస్తావించారు. ఆటంకాలు, ఆక్రమణలు తొలగించాలని కోరారు. బ్రాహ్మణ సేవా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుదాం



ఎమ్మెల్యే భూమా అఖిలప్రియను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ రామలింగారెడ్డి

ఆళ్లగడ్డ: అపరిష్కృతంగా ఉన్న మురుగు కాల్వలు, సీసీ రోడ్లతో పాటు సమస్యలన్నింటినీ పరిష్కరించి ఆళ్లగడ్డను పరిశుభ్రమైన, ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగారెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అఖిలప్రియ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు రాజకీయాలు చేయకుండా వారివారి శాఖల అభివృద్ధి పనుల గురించి మాత్రమే ఆలోచించాలని, రాజకీయాలు తాము చూసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం మారిన ప్రతిసారీ అధికారులపై ఒక ముద్ర పడుతుందని, అధికార పార్టీకి అండగా ఉన్నారని, ఎమ్మెల్యే మారితే ఉద్యోగులు ఆందోళన చెందడం సహజమన్నారు. అయితే అలాంటివేవీ అవసరం లేదన్నారు. పచ్చ కండువా కప్పుకుంటేనే పనులు జరుగుతాయని ఆలోచన పెట్టుకోవద్దు.. గతాన్ని మరిచిపోండి, ఎవరి పనులు వారు నిబద్ధతతో చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, కమిషనర్ రవేష్‌బాబు ఉన్నారు.